తమిళనాట 'కచ్చతీవు' రగడ

- **లోక్‌సభ ఎన్నికల వేళ మళ్లీ తెరపైకి**
- **గత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా శ్రీలంకకు ఇచ్చిందని మోదీ విమర్శ**
- **చైనా ఆక్రమణలపై ఎందుకు స్పందించరని కాంగ్రెస్ దాడి**

న్యూఢిల్లీ/చెన్నై, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల వేళ తమిళనాడులో కచ్చతీవు ద్వీపంపై రాజకీయ రగడ రేగింది. కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఈ దీవిని శ్రీలంకకు అప్పగించిందని ప్రధాని మోదీ ఆదివారం ఒక మీడియా కథనాన్ని ఉటంకిస్తూ ఎక్స్‌లో తీవ్ర విమర్శలు గుప్పించారు. కచ్చతీవును శ్రీలంకకు ఇవ్వడం ప్రతి భారతీయుడిని ఆగ్రహానికి గురిచేసిందన్నారు. దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్.. దేశ ఐక్యత, సమగ్రత, ప్రయోజనాలను దెబ్బతీసిందని విమర్శించారు. తమిళ జాలర్లను తరచూ శ్రీలంక నేవీ అరెస్ట్ చేస్తుండటం, బోట్లు, ఇతర విలువైన మెషినరీని స్వాధీనం చేసుకుంటుండటంపై మత్స్యకారులు ఆందోళనలు చేస్తున్న క్రమంలో కచ్చతీవు అంశం రాజకీయంగా కీలకంగా మారే అవకాశం ఉన్నది. తమిళనాడులో ప్రాబల్యాన్ని పెంచుకోవాలని చూస్తున్న బీజేపీ వ్యూహాత్మకంగా ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అప్పగింతను మేం వ్యతిరేకించాం: డీఎంకే

కచ్చతీవుపై తాజాగా రేగిన రాజకీయ దుమారంపై తమిళనాడు అధికార పార్టీ డీఎంకే స్పందించింది. శ్రీలంకకు కచ్చతీవు అప్పగింతను తమ పార్టీ వ్యతిరేకించిందని పేర్కొన్నది. డీఎంకే నేత ఆర్ఎస్ భారతి మాట్లాడుతూ.. చెప్పుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలేమీ లేక, ప్రధాని మోదీ అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. 1974లో కచ్చతీవు అప్పగింతకు వ్యతిరేకంగా డీఎంకే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టిందని పేర్కొన్నారు. కాగా, కచ్చతీవు అంశాన్ని మోదీ లేవనెత్తడంపై తమిళనాడు పీసీసీ చీఫ్ కే సెల్వపెరుంతగై ఎదురుదాడి చేశారు. భారత భూభాగాల్లోనైనా ఆక్రమణలు, పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘన, పుల్వామా ఉగ్రదాడి, మణిపూర్ అల్లర్లపై మోదీ ఎప్పుడు మాట్లాడుతారని ప్రశ్నించారు.

ఏమిటీ వివాదం?

కచ్చతీవు అప్పగింతకు సంబంధించిన అధికారిక పత్రాలు, రికార్డులను తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై ఆర్టీఐ దరఖాస్తు ద్వారా తీసుకొన్నారు. అవి ఆ దీవిని శ్రీలంక ఎలా స్వాధీనం చేసుకొన్నదనే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. కచ్చతీవుకు సంబంధించిన చట్టపరమైన అంశాలు చాలా క్లిష్టంగా ఉన్నాయని, దానిపై సార్వభౌమాధికారానికి సంబంధించి స్పష్టత లేదని అప్పటి విదేశాంగ శాఖ నోట్ ఒకటి పేర్కొన్నది. అయితే ఈస్ట్ ఇండియా కంపెనీ కచ్చతీవు జమిందారీ హక్కులను రామనాడు రాజుకు అప్పట్లో అప్పగించిందని, 1875 నుంచి 1948 వరకు మద్రాస్ ప్రెసిడెన్సీ కచ్చతీవుపై హక్కును కొనసాగించిందని పలువురు న్యాయ నిపుణులు అభిప్రాయపడినట్టు ఆ డాక్యుమెంట్ పేర్కొన్నది. అయితే కచ్చతీవు అప్పగింతపై భారత పర్యటనకు వచ్చిన శ్రీలంక ప్రధాని సేనానాయకేతో అప్పటి మన దేశ ప్రధాని ఇందిరా గాంధీ రహస్యంగా చర్చలు జరిపారని విపక్షాలు ఆరోపించాయి. శ్రీలంక మ్యాప్‌లో కచ్చతీవు చూపించడంపై స్పందించిన అప్పటి భారత ప్రభుత్వం.. దీవిని శ్రీలంకకు ఇవ్వలేదని, అది ఒక వివాదాస్పద ప్రాంతమని పేర్కొన్నది. 1974లో కచ్చతీవును శ్రీలంకకు అప్పగిస్తూ తీసుకొన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తమిళనాడు సీఎం కరుణానిధికి తెలియజేసింది.

బీజేపీ వాషింగ్ మెషీన్!

- అవినీతిపరులని నిందించిన వారికే టికెట్లు
- నాటి స్కామ్‌స్టర్లే.. నేడు స్టార్ క్యాంపెయినర్లు
- అప్పుడు ఆరోపణలు.. ఇప్పుడు ఆలింగనాలు
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మార్క్ రాజకీయం

న్యూఢిల్లీ, మార్చి 31: ప్రత్యర్థులుగా ఉన్నప్పుడు వారంతా అవినీతిపరులు. పార్టీలోకి వచ్చాక వారే ఆదర్శవంతులు. అవతలి పార్టీలో ఉంటే వారిపై నిందారోపణలు. కాషాయ కండువా కప్పుకున్నాక వారికే నీరాజనాలు. లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ మార్క్ రాజకీయమిది. గతంలో అవినీతిపరులని ఆరోపించిన నేతలనే రెడ్‌కార్పెట్ పరిచి పార్టీలోకి చేర్చుకుంటున్నది. బీజేపీ కండువా కప్పేసి పునీతులను చేసేస్తున్నది. పార్టీ టికెట్లు కేటాయిస్తున్నది. ఆఖరికి పార్టీ తరపున ప్రచారం చేసే స్టార్ క్యాంపెయినర్లను కూడా చేసేస్తున్నది. అజిత్ పవార్ మొదలుకొని నవీన్ జిందాల్ వరకు గతంలో బీజేపీ చేత అవినీతిపరులుగా ముద్ర వేయించుకున్న నేతలంతా ఇప్పుడు అదే పార్టీతో చేతులు కలిపారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తున్న రాజకీయ విశ్లేషకులు...

మళ్లీ బీజేపీలోకి 'గాలి'

బీజేపీ నేతగా ఉంటూనే అక్రమ మైనింగ్‌కు పాల్పడిన కేసులో ఇరుక్కొని జైలుకు వెళ్లొచ్చిన కర్ణాటక నేత, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డిని కొంతకాలం బీజేపీ పక్కనపెట్టింది. ఆయన సోదరులకు మాత్రం టికెట్లు ఇచ్చింది. దీంతో బీజేపీపై కోపంతో గాలి జనార్దన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి, బాగల్‌కోట్, కొప్పాళ జిల్లాలో బీజేపీకి నష్టం చేశారు. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి నష్టం జరగకుండా ఆయనను మళ్లీ బీజేపీలో చేర్చుకున్నారు.

బీజేపీని వాషింగ్ మెషీన్‌తో పోలుస్తున్నారు. ఎన్ని మరకలున్న దుస్తులైనా ఒకసారి వాషింగ్ మెషీన్‌లో వేస్తే శుభ్రమైనట్టు బీజేపీలో చేరిన నేతలు కూడా మంచి వారు అయిపోతున్నారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

మహారాష్ట్ర బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా అజిత్

ఎన్సీపీలో చీలిక తెచ్చి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అయిన అజిత్ పవార్‌ను ఈ ఎన్నికల కోసం స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో బీజేపీ చేర్చింది. గతంలో ఆయనపై బీజేపీ అనేక ఆరోపణలు చేసింది. మహారాష్ట్ర స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో రూ.25 వేల కోట్ల కుంభకోణం కేసు కూడా ఆయనపై ఉండేది. అయితే, బీజేపీతో జట్టుకట్టిన తర్వాత ఈ కేసులో అజిత్ పవార్‌కు పోలీసు శాఖ క్లీన్‌చిట్ ఇచ్చింది. ఇప్పుడు అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఇదే ఎన్సీపీని 2014లో ప్రధాని మోదీ.. నేచురల్ కరప్షన్ పార్టీగా నిర్వచించారు.

మరో స్టార్ క్యాంపెయినర్ 'ఆదర్శ్' అశోక్ చవాన్

మహారాష్ట్రలోనే ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్‌ను రాజ్యసభ సభ్యుడిని చేయడంతోపాటు పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా బీజేపీ నియమించింది. ఆదర్శ్ కుంభకోణంలో చవాన్ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసును ఈడీ విచారిస్తున్నది. గతంలో అనేకసార్లు చవాన్‌ను బీజేపీ అవినీతిపరుడని విమర్శించింది. 2014లోనైతే చవాన్‌కు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్‌కు సిగ్గులేదని మోదీ నిందించారు.

కండువా కప్పుకోగానే నవీన్ జిందాల్‌కు టికెట్

ఇటీవల కాంగ్రెస్ మాజీ ఎంపీ, పారిశ్రామిక వేత్త నవీన్ జిందాల్ బీజేపీలో చేరగా, గంటల వ్యవధిలోనే ఆయనకు కురుక్షేత్ర ఎంపీ టికెట్ ఇచ్చారు. జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లో బొగ్గు గనుల కేటాయింపుల్లో అక్రమాల ఆరోపణలు నవీన్‌పై ఉన్నాయి. సీబీఐ, ఈడీ కూడా విచారించింది. ఈ బొగ్గు గనుల కుంభకోణానికి సంబంధించి మోదీ గతంలో అనేక ఆరోపణలు చేశారు. జార్ఖండ్ గనులు లూటీ కాకుండా చేస్తానని ఆయన ప్రకటించారు.

గీతా కొడాకు కండువా కప్పేశారు

బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంలో అవినీతి ఆరోపణలపై జైలు శిక్ష అనుభవించిన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడా భార్య గీతా కోడాను ఇటీవల పార్టీలో చేర్చుకుంది బీజేపీ. ఆమెకు సింఘ్‌భుమ్ లోక్‌సభ టికెట్ ఇచ్చింది. గీతా కోడా 2018లో కాంగ్రెస్‌లో చేరినప్పుడు బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై అనేక విమర్శలు చేశారు. అవినీతిని వ్యవస్థీకృతం చేస్తున్నారని, మధు కోడా చేసిన కుంభకోణంలో కాంగ్రెస్ నేతలకూ పాత్ర ఉన్నదని ఆరోపించారు.

'దొంగ' అన్న నేతకే టికెట్

పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత తపస్ రాయ్‌ను ఇటీవల బీజేపీలో చేర్చుకుని కోల్‌కతా నార్త్ ఎంపీ టికెట్ ఇచ్చారు. మున్సిపాలిటీ ఉద్యోగ నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై ఆయనపై ఈడీ విచారణ జరిపింది. ఆ సమయంలో బెంగాల్ బీజేపీ కీలక నేత సువేందు అధికారి.. తపస్ రాయ్‌ను 'దొంగ' అని విమర్శించారు.

ఇలా చెప్పుకుంటూ పోతే అవినీతి ఆరోపణలు ఉన్న, సీబీఐ, ఈడీ, ఐటీ తదితర దర్యాప్తు సంస్థల విచారణ ఎదుర్కొన్న ఎంతో మంది నేతలను పార్టీలోకి చేర్చుకొని మంచి ప్రాధాన్యం ఇస్తున్నది బీజేపీ.

400 కాదు.. కనీసం 200 సీట్లు గెలవండి

బీజేపీకి మమత సవాల్

కృష్ణానగర్, మార్చి 31: వచ్చే ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 400కు పైగా ఎంపీ సీట్లు గెల్చుకోవాలని పెట్టుకున్న లక్ష్యాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎద్దేవా చేశారు. 400 కాదు, కనీసం 200 స్థానాల్లో అయినా గెలవాలని ఆమె సవాల్ విసిరారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని బెంగాల్‌లో ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని మరోసారి స్పష్టం చేసిన ఆమె, సీఏఏకు దరఖాస్తు చేసిన వారిని విదేశీయులుగా పరిగణిస్తారు కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో దానికి దరఖాస్తు చేయవద్దంటూ హెచ్చరించారు. చట్టబద్ధంగా గుర్తించిన భారత పౌరులను విదేశీయులుగా మార్చే కుట్రే సీఏఏ అని అన్నారు.

దంపతుల మధ్య ఎన్నికల చిచ్చు

న్యూఢిల్లీ: ఎన్నికల రాజకీయాలు కుటుంబాల్లో చిచ్చు రేపుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ లోక్‌సభ నియోజకవర్గంలో భార్యాభర్తల మధ్య సైద్ధాంతిక విభేదాలు ఈ స్థాయికి చేరుకున్నాయి. బాలాఘాట్ ఎమ్మెల్యే అనుభ ముంజరే కాంగ్రెస్ నేత. ఆమె భర్త కంకర్ ముంజరే లోక్‌సభ ఎన్నికల్లో బాలాఘాట్ నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అనుభ మాట్లాడుతూ పోలింగ్ పూర్తయ్యే వరకు దూరంగా ఉండాలని తన భర్త తనకు చెప్పారని తెలిపారు. కంకర్ మాట్లాడుతూ, తామిద్దరమూ ఒకే ఇంట్లో ఉంటే, ఈ ఎన్నికల్లో తాము మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నామని ప్రజలు భావిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అనుభ స్పందిస్తూ, గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ తామిద్దరం పోటీ చేశామని..అప్పట్లో ఒకే ఇంట్లో ఉన్నామని, ఇప్పుడు మాత్రమే ఆయన వేర్వేరుగా ఉండామని చెప్పడం చాలా ఆశ్చర్యంగా ఉందని వాపోయారు.

అప్నాదళ్(కే)తో ఎంఐఎం పొత్తు

లక్నో: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీచేయాలని అప్నాదళ్ (కమెరావాదీ), ఏఐఎంఐఎం నిర్ణయించాయి. ఈ మేరకు రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరింది. ఆదివారం మీడియా సమావేశంలో ఇరువురు నేతలు పొత్తు గురించి వెల్లడించారు. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ, అప్నాదళ్(కే) పొత్తు పెట్టుకోగా, తర్వాత విభేదాలతో దూరమయ్యాయి.

బారామతిలో పవార్ వర్సెస్ పవార్

సుప్రియా సునేత్ర

ముంబై: మహారాష్ట్రలోని బారామతి నియోజకవర్గంపై అందరి దృష్టినెలకొంది. ఇక్కడి నుంచి మూడుసార్లు విజయం సాధించి నాలుగోసారి బరిలో నిలిచిన శరద్‌పవార్ కుమార్తె సుప్రియా సూలేకు ఇప్పుడు కుటుంబసభ్యుల నుంచే తీవ్ర పోటీ ఎదురవుతున్నది. ఎన్సీపీని చీల్చి బీజేపీతో చేతులు కలిపిన శరద్‌పవార్ సోదరుడి కుమారుడు, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్.. తన భార్య సునేత్ర పవార్‌ను ఇక్కడి నుంచి బరిలో నిలుపుతున్నారు. దీంతో వదిన, మరదలి మధ్య పోరుపై నియోజకవర్గ ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. కాగా, మహావికాస్ అఘాడీలో భాగస్వామిగా ఉన్న ఎన్సీపీ(శరద్ పవార్) రాష్ట్రంలోని 48 స్థానాలకు గాను 10 సీట్లలో పోటీ చేస్తున్నది.

'నన్ను గెలిపిస్తే రేషన్‌లో మద్యం'

ముంబై, మార్చి 31(నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో అఖిల భారతీయ మానవతా పార్టీ నుంచి పోటీ చేస్తున్న వనితా రౌత్ ఇచ్చిన హామీ ఆసక్తి రేపుతున్నది. తాను ఎంపీగా గెలిస్తే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి చౌక ధరల దుకాణాల నుంచి రేషన్‌తో పాటు విస్కీ, బీరును అందించనున్నట్టు ఆమె ప్రకటించారు. దీనితో పాటు, నిరుద్యోగ యువకులకు మద్యం లైసెన్సులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌కు మరో షాక్

తాజాగా రూ.1,745 కోట్ల పన్ను నోటీసు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీకి ఐటీ విభాగం నుంచి మరో పన్ను నోటీసు వచ్చిందని హస్తం పార్టీ వర్గాలు వెల్లడించాయి. రూ.1,745 కోట్ల పన్ను డిమాండ్‌తో నోటీసు పంపిందని తెలిపాయి. తాజా నోటీసుతో కాంగ్రెస్ పార్టీకి ఐటీ శాఖ ఇచ్చిన పన్ను నోటీసుల డిమాండ్ మొత్తం రూ.3,567కి చేరింది. తాజా నోటీసులు 2014-15 ఆర్థిక సంవత్సరానికి రూ.663 కోట్లు, 2015-16కు రూ.664 కోట్లు, 2016-17 ఏడాదికి రూ.417 కోట్ల పన్ను వసూలుకు సంబంధించినవని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐటీ శాఖ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఖాతాల నుంచి రూ.135 కోట్లు విత్‌డ్రా చేసుకొన్నది. దీనికి ఆ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. పిటిషన్ సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉన్నది.

రూ.8.4 లక్షల కోట్లతో ఏఐ సూపర్ కంప్యూటర్

న్యూఢిల్లీ: ప్రపంచ టెక్ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్, ఓపెన్‌ఏఐ (చాట్ జీపీటీ సృష్టికర్త) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మరో భారీ ముందడుగు వేయాలని నిర్ణయించుకున్నాయి. ఏఐ టెక్నాలజీ వాస్తవిక సామర్థ్యాన్ని అందిపుచ్చుకునేందుకు 'స్టార్‌గేట్' పేరుతో సూపర్ కంప్యూటర్‌ను తయారు చేయనున్నట్టు ప్రకటించాయి. 100 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.34 లక్షల కోట్ల) అంచనా వ్యయంతో ఏఐ సూపర్ కంప్యూటర్‌ను 2028లో ఆవిష్కరించనున్నట్టు తెలుస్తున్నది.

నిరంకుశం సాగదు

- **కేజ్రీవాల్‌ను ఎక్కువకాలం జైల్లో నిర్బంధించలేరు**
- **విపక్షాల సేవ్ డెమొక్రసీ ర్యాలీలో సునీతా కేజ్రీవాల్**
- **కేజ్రీవాల్, సొరేన్‌ను విడుదల చేయాలని నేతల డిమాండ్**

లోక్‌తంత్ర బచావో ర్యాలీలో మాట్లాడుతున్న సునీత కేజ్రీవాల్, కల్పనా సొరేన్

న్యూఢిల్లీ, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల వేళ విపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, పలువురు కీలక నేతల అరెస్టుల నేపథ్యంలో ఇండియా కూటమి ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'సేవ్ డెమొక్రసీ' ర్యాలీ చేపట్టింది. ఈ సందర్భంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. నిరంకుశం ఎల్లకాలం సాగదని, కేజ్రీవాల్‌ను ఎక్కువకాలం జైల్లో ఉంచలేరని పేర్కొన్నారు. తన భర్తను ఆమె సింహంతో పోల్చారు. ఈ సందర్భంగా ఈడీ కస్టడీ నుంచి కేజ్రీవాల్ ఇచ్చిన సందేశాన్ని ఆమె చదివి వినిపించారు. అందులో ఇండియా కూటమి తరపున ఆరు గ్యారెంటీలు ఉన్నాయి. అందులో ఢిల్లీకి రాష్ట్ర హోదా, పేదలకు ఉచిత విద్యుత్తు వంటివి ఉన్నాయి. కార్యక్రమంలో జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్ భార్య కల్పనా సొరేన్ కూడా పాల్గొన్నారు.

'మ్యాచ్ ఫిక్సింగ్'తో గెలిచేందుకు కుట్రలు

విపక్ష నేతలు మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, కేంద్రంలోని బీజేపీ విపక్షాలపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'మ్యాచ్ ఫిక్సింగ్' ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో గెలువాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని అన్నారు. అంపైర్లను ఆయననే ఎంపిక చేసుకోవడం ద్వారా, ప్లేయర్లను(విపక్ష నేతలను) జైల్లో పెట్టడం ద్వారా గెలవాలని అనుకొంటున్నారని పేర్కొన్నారు. బీజేపీ మళ్లీ గెలిస్తే ఆ పార్టీ దేశ రాజ్యాంగాన్నే మారుస్తుందని అన్నారు. ఈవీఎంలు, మ్యాచ్‌ఫిక్సింగ్, మీడియా ఒత్తిడి లేకుండా బీజేపీ 180 లోక్‌సభ సీట్లు కూడా గెలువలేదని రాహుల్ పేర్కొన్నారు. ఐక్యత ద్వారానే మోదీని ఓడించగలమని, సమాఖ్య భారత్ నుంచి ఫాసిస్టు బీజేపీని తరిమికొట్టగలమని తమిళనాడు సీఎం స్టాలిన్ అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతో అధికార బీజేపీ విపక్ష నేతలను అరెస్టులు చేయిస్తున్నదని ఆయన తరపున సందేశాన్ని వినిపించిన డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ పేర్కొన్నారు. విపక్షాల ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, శరద్ పవార్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా, పీడీపీ చీఫ్ ముఫ్తీ, ఎన్సీ నేత ఫరూక్ అబ్దుల్లా, టీఎంసీ ఎంపీ డెరిక్ ఓబ్రియన్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీకి 5 డిమాండ్లు

ఇండియా కూటమి ఈ సందర్భంగా ఈసీకి ఐదు డిమాండ్లు చేసింది. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేసింది. ఈడీ అరెస్టు చేసిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్‌ను వెంటనే విడుదల చేయాలని, విపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ, ఐటీ తీసుకొంటున్న బలవంతపు చర్యలను నిలిపివేయాలని, ప్రతిపక్షాలను ఆర్థికంగా దెబ్బతీసేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆపాలని, అదేవిధంగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అధికార బీజేపీకి పెద్దమొత్తంలో వచ్చిన విరాళాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్‌తో దర్యాప్తు చేయించాలనే డిమాండ్లు ఈసీ ముందు పెట్టింది.

అక్రమ రుణ యాప్‌లకు చెక్!

'డీఐజీఐటీఏ' ఏర్పాటు యోచనలో ఆర్బీఐ

న్యూఢిల్లీ, మార్చి 31: దేశంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న చట్టవిరుద్ధమైన రుణ యాప్‌లను నియంత్రించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) డిజిటల్ ఇండియా ట్రస్టు ఏజెన్సీ(డీఐజీఐటీఏ) ఏర్పాటు చేయనున్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతిపాదిత ఏజెన్సీ డిజిటల్ లెండింగ్ యాప్‌లను వెరిఫై చేస్తుందని, అలాగే వెరిఫికేషన్ అయిన యాప్‌లకు సంబంధించిన పబ్లిక్ రిజిస్టర్‌ను నిర్వహిస్తుందని పేర్కొన్నాయి. డీఐజీఐటీఏ చేత 'వైరిఫైడ్' సిగ్నేచర్ లేని యాప్‌లను అనధికార యాప్‌లుగా పరిగణించాల్సి ఉంటుందని తెలిపాయి. నేటి డిజిటల్ యుగంలో దేశంలో పెరుగుతున్న సైబర్ మోసాలకు చెక్ పెట్టడంలో ఈ ఏజెన్సీ కీలక పాత్ర పోషిస్తుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

కంబోడియాలోని 250 మంది భారతీయులకు విముక్తి

న్యూఢిల్లీ: కంబోడియాలో ఉద్యోగాల పేరుతో మోసపోయిన 250 మందికి విముక్తి కల్పించి, స్వదేశానికి రప్పించినట్లు విదేశాంగ శాఖ శనివారం తెలిపింది. వీరితో చట్టవిరుద్ధంగా సైబర్ వర్క్ చేయించినట్లు ఆరోపణలు వచ్చాయి. భారతీయులు కంబోడియాలో చిక్కుకున్న విషయంపై మీడియా కథనాలతోపాటు బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఇండియన్ ఎంబసీ సకాలంలో స్పందించిందని తెలిపింది.

అద్వానీకి భారతరత్న ప్రదానం

ఇంటికి వెళ్లి అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, మార్చి 31: బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ (96) భారత అత్యున్నత పురస్కారం భారతరత్న అందుకున్నారు. ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి పురస్కారాన్ని అందజేశారు. వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్న అద్వానీ శనివారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అవార్డుల స్వీకరణ కార్యక్రమానికి హాజరు కాలేక పోయారు. దీంతో రాష్ట్రపతి ఆయన నివాసానికే వెళ్లి పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, అద్వానీ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ప్రధాని మోదీ పక్కనే కూర్చొని ఉండగా, భారతరత్న పురస్కారాన్ని రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అద్వానీ అందుకున్నారు. అద్వానీకి భారతరత్న ప్రదానంపై ప్రధాని మోదీ ఎక్స్‌లో స్పందించారు. 'ప్రజాసేవ పట్ల ఆయన అంకిత భావం, దేశ ప్రగతికి ఆయన చేసిన నిరంతర కృషికి గుర్తింపు ఇది. నవభారత నిర్మాణంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఆయనతో సన్నిహితంగా పనిచేసే అవకాశం వచ్చినందుకు గర్వపడుతున్నా' అని అన్నారు.

అంధ విద్యార్థులకు అర్థమయ్యేలా..

చేతివేలిపై పాఠ్యాంశాలు.. సరికొత్త టెక్నాలజీ అభివృద్ధి



బెంగళూరు, మార్చి 31: తరగతి గదిలో చెప్పే పాఠ్యాంశాలను అంధ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా చేసే కొత్త సాంకేతికతను ట్రిపుల్ ఐటీ బెంగళూరుకు చెందిన విద్యార్థులు అభివృద్ధి చేశారు. దీని ద్వారా అధ్యాపకులు బోర్డుపై వివరించే అంశాలు అంధ విద్యార్థులకు చేతి వేళ్లపై అర్థమవుతాయి. ఇందుకోసం ఒక చిన్న పరికరాన్ని చేతి వేలికి పెట్టుకోవాలి. తరగతి గదిలో సాధారణ బోర్డు కాకుండా స్మార్ట్ బోర్డు ఉండాలి. వైఫై ద్వారా బోర్డుకు, విద్యార్థి చేతివేలికి ఉండే పరికరం అనుసంధానమై పని చేస్తుంది. అధ్యాపకులు బోర్డుపై రాసిన వాటిని చేతివేలికి ఉన్న పరికరం విద్యార్థితో డెస్కుపై రాయిస్తుంది. కంప్యూటర్ మౌస్‌ను వినియోగించేటప్పుడు చేతివేళ్లు ఎలా కదులుతాయో ఈ పరికరం ద్వారా కూడా అలానే కదులుతాయి. ఇందులో బ్రెయిలీ సెన్సార్ కూడా ఉంటుంది కాబట్టి అంధ విద్యార్థులకు సులువుగా అర్థమవుతుంది. దీని ధర కూడా తక్కువేనని ట్రిపుల్‌ఐటీ బెంగళూరు అసోసియేట్ ప్రొఫెసర్ మాధవ్‌రావు తెలిపారు. త్వరలోనే ఈ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు.

న్యూయార్క్‌లో 'రద్దీ రుసుము'

ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యం..అమెరికాలో ఇదే తొలిసారి

న్యూయార్క్: పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నివారించడంతోపాటు కాలుష్యాన్ని తగ్గించాలని భావిస్తున్న న్యూయార్క్ కీలక నిర్ణయం తీసుకుంది. మన్‌హట్టన్‌లోని రద్దీప్రాంతంలో ఇకపై కార్లు ప్రవేశిస్తే 'రద్దీ రుసుము'గా 15 డాలర్లు వసూలు చేయాలని నిర్ణయించింది. జూన్ మధ్య నుంచి ఇది అమల్లోకి రానుంది. రద్దీ టోల్ వసూలు చేయాలన్న నిర్ణయాన్ని న్యూయార్క్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ 11-1 ఓట్లతో ఆమోదించింది. క్వీన్స్, బ్రూక్లిన్, న్యూజెర్సీ నుంచి మన్‌హట్టన్ సౌత్ 60వ స్ట్రీట్‌లోకి ప్రవేశించే ట్యాక్సీలు, ప్రయాణికుల, వాణిజ్య వాహనాలు పగటి వేళలో అయితే 15 డాలర్లు, రాత్రివేళ అయితే 3.75 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పగటి వేళ ట్రక్కులు 24 డాలర్లు, సైట్‌సీయింగ్ బస్సులు 36 డాలర్లు చెల్లించాలి. రాత్రివేళ ఇది కొంత తక్కువగా ఉంటుంది. ఉబర్ లాంటి రైడ్‌షేరింగ్ సేవల వాహనాలకు ప్రతి ట్రిప్‌కు 2.50 డాలర్లు వసూలు చేస్తారు. అత్యవసర సేవలు అందించే వాహనాలు, దివ్యాంగులను తీసుకెళ్లే వాహనాలను మినహాయించారు. అమ